సాక్షి సిద్దిపేట

గురువారం । 1 । ఆగస్టు । 2024



నాడు ప్రజా బాట.. నేడు ఉపాధి వేట

పోతరాజుగా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బాబురావు

ఐదేళ్ల కాలంలో గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో కుటుంబ పోషణపై దృష్టిసారించారు. కొందరు సొంత ఊరిలో పొలం పనులు చేస్తుండగా, మరికొందరు వ్యాపారాలు చేస్తూ జీవనం గడిస్తున్నారు. పదవీ కాలం ముగిసిన స్థానిక సంస్థ మాజీ ప్రజాప్రతినిధుల ప్రస్తుత జీవన స్థితిగతులపై సాక్షి ప్రత్యేక కథనం.

వివరాలు 8లో ▶

న్యూస్‌రీల్

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

డీఐఈఓ హిమబిందు



విద్యార్థులను సన్మానిస్తున్న డీఐఈఓ హిమబిందు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు లభిస్తాయని డీఐఈఓ హిమబిందు తెలిపారు. మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాతో సన్మానించి నగదు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివితేనే అత్యుత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. మంచి క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు భవితకు బంగారు బాటలు వేసుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు



సిద్దిపేటకమాన్: ఆర్టీసీ ఉమ్మడి మెదక్ రీజియన్‌లో సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ ఉత్తమంగా ఎంపిక అయినట్లు డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడ్రన్ బస్టాండ్‌లో ప్రయాణికులకు మంచి వసతులు, సౌకర్యాలు కల్పించినందుకు గాను ఈ అవార్డు దక్కిందని, ఇందుకు రూ.5వేల నగదును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్ మంగళవారం అందజేసినట్లు తెలిపారు. ఈ డబ్బులు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం వినియోగించనున్నట్లు డీఎం తెలిపారు.

రేపు దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో సమగ్ర శిక్షా అభియాన్, అలింకో సంస్థల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్ల లోపు ఉన్న దివ్యాంగులు ఈ గుర్తింపు శిబిరంలో పాల్గొనాలన్నారు. ఈ శిబిరంలో గుర్తించిన దివ్యాంగులకు రెండు నెలల్లో ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు.

కుక్కల బెడదను అరికడతాం



మాట్లాడుతున్న చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అరికట్టేందుకు యానిమల్ బర్త్ కంట్రోల్ లేదా బ్లూక్రాస్ సొసైటీని సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంపై ప్రత్యేక తీర్మానం చేసి ఆమోదించారు. మరో 2 అంశాలను చర్చించి ఆమోదం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పలువురు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

సిద్దిపేటకమాన్: జిల్లాలోని పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంప్స్ కమిషనర్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. చేర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణయ్య కామారెడ్డికి బదిలీ కాగా ఆయన స్థానంలో కరీంనగర్ నుంచి జే.మనోహర్ రానున్నారు. హుస్నాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఎండి.ఇంతియాజ్ హుజురాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో దొమకొండ నుంచి ఎండి.అబ్దుల్‌జబ్బర్ రానున్నారు. కరీంనగర్ రూరల్ నుంచి ఎస్.రాజేష్‌ను గజ్వేల్ ఎస్‌ఆర్ ఓగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫుల్లు కావాల్సిందే



2023 జూలైలో అమ్మకాలు రూ.94 కోట్లు

2024 జూలైలో రూ.75కోట్లు

- మద్యం అమ్మకాల్లో టార్గెట్
- వైన్స్ యజమానులపై ఎక్సైజ్ శాఖ ఒత్తిడి
- లిక్కర్ గోదాం నుంచి అర్ధరాత్రి వరకూ సరఫరా
- గతేడాది కంటే తగ్గిన అమ్మకాలు

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరులైన ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆశాఖ అపసోపాలు పడుతోంది. మద్యం అమ్మకాలను మరింత పెంచాలని వైన్ షాపుల యజమానులపై ప్రత్యక్షంగానే ఒత్తిడి తెస్తున్నారు. గత ఏడాది జూలైలో డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యం విలువకు ఏమాత్రం తగ్గకుండా ఈనెలలో కూడా కొనుగోలు చేయాల్సిందేనని వైన్స్‌ల యజమానులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో మంగళ, బుధవారాల్లోనే సుమారు రూ.10 కోట్ల విలువ చేసే మద్యం డిపో నుంచి లిఫ్ట్ అయినట్లు తెలుస్తోంది. జూలై 31 చివరి రోజు కావడంతో అర్ధరాత్రి వరకు సిద్దిపేట లిక్కర్ గోదాం నుంచి వైన్, బార్ షాప్‌లకు మద్యం సరఫరా చేయడం గమనార్హం.

– సాక్షి, సిద్దిపేట



సిద్దిపేట లిక్కర్ గోదాం నుంచి రాత్రి సమయంలో సైతం వాహనాల్లో మద్యం సరఫరా

గతేడాది జూలై నెలలో 25 నుంచి 31వ తేదీ వరకు మద్యం వ్యాపారులకు బంపర్ ఆఫర్‌ను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌బీసీఎల్) ఇచ్చింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా క్రెడిట్ రూపంలో వైన్, బార్లకు సరఫరా చేశారు. సాధారణంగా మద్యం వ్యాపారులు ఎంత చలానా కడితే అంతమొత్తం మద్యం సిద్దిపేట పట్టణ శివారు ఇర్కోడు లోని డిపో నుంచి అందించేవారు. పోస్ట్ పెయిడ్ చెక్కులతో మద్యం అందించారు. దీంతో మద్యం వ్యాపారులు ఎంత వీలైతే అంత స్టాక్‌ను క్రెడిట్‌తో తీసుకున్నారు. గతేడాది జూలై నెలలో రూ.94.30కోట్ల స్టాక్‌ను తీసుకోగా ఈసారి ఈ నెల 29వ తేదీ వరకు రూ.75కోట్ల మద్యం మాత్రమే తీసుకున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు మంగళ, బుధ వారాల్లో రంగంలోకి దిగి స్టేషన్‌ల వారీగా గతేడాది తీసుకున్న స్టాక్‌కు అనుగుణంగా మద్యం తీసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. అధికారుల ఒత్తిడిని తట్టుకోలేక మద్యంను టార్గెట్‌కు రీచ్ అయ్యేవిధంగా స్టాక్‌ను డంప్ చేసుకున్నారు.

క్రెడిట్ ఇవ్వడంతో స్టాక్ డంప్

గతేడాది క్రెడిట్ ఇవ్వడంతో వ్యాపారులు ఎక్కువ స్టాక్ తీసుకున్నారు. కొత్త మద్యం పాలసీ అమలు చేయడంతో పాత వారి నుంచి కొత్త వారు మద్యం షాప్‌లను దక్కించుకున్నారు. గతేడాది క్రెడిట్ ఇవ్వడంతో ఎక్కువ స్టాక్ దింపుకున్నామని.. మాకేందుకు టార్గెట్ అని పలువురు మద్యం వ్యాపారులు ఎక్సైజ్ అధికారులకు సమాధానం చెప్పినట్లు తెలిసింది. గతేడాది మాదిరిగా క్రెడిట్ ఇవ్వండి మేము కూడా ఎక్కువ స్టాక్ దింపుకుంటామని చెప్పారని తెలుస్తోంది.

సహకారం అందిస్తాం

మీకు సహకారం అందిస్తాం కానీ మీ టార్గెట్ రీచ్ అవ్వండి అని ఎక్సైజ్ అధికారులు పలువురు మద్యం వ్యాపారులకు ఆఫర్‌లు సైతం ఇచ్చినట్లు సమాచారం. బెల్ట్ షాప్‌లకు సరుకు ఇచ్చేటప్పుడు ఎంఆర్‌పీ ధరలకే ఇవ్వండి... ఒక్కో బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20లు తీసుకోకుండా ఇవ్వాలని చెప్పినట్లు తెలిసింది. అదే వైన్ షాప్‌ల వారు ఎంఆర్‌పీకి ఇవ్వడంతో బెల్ట్‌షాప్‌ల వారు రూ. 10 నుంచి రూ.20లు తక్కువ ధరకు విక్రయించడం వలన పోయేదేం లేదని, దీంతో మద్యం అమ్మకాల బెల్ట్ షాప్‌లలో పెరిగే అవకాశం ఉంటుందని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఇనాళ్లు బెల్టుషాపులను చూసీచూడనట్లు వదిలేసిన ఎక్సైజ్ శాఖ ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి ఏకంగా బెల్ట్ షాప్‌లను బతికించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై సర్వత్రా చర్చ సాగుతోంది.

అలాంటిదేమీలేదు..



మద్యం అమ్మకాలు ఎప్పుడు వైన్, బార్ షాప్‌లకు టార్గెట్ పెట్టలేదు. గతేడాది అయిన సేల్స్‌కు అనుగుణంగా ఉంటే బాగుంటుంది. సేల్స్ తగ్గితే నాన్‌డ్యూటీ మద్యం, గుడుంబా విక్రయాలు సాగుతున్నాయా అనే సందేహం కలుగుతుంది.

–శ్రీనివాస మూర్తి, ఈఎస్, సిద్దిపేట

ఆస్పత్రుల్లో అధునాతన సేవలు

- కలెక్టర్ మనుచౌదరి
- వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన



ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం ఎన్సాన్‌పల్లి శివారులో నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ సందర్శించారు. నూతన భవనాన్ని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు అధునాతన వైద్య సేవలు అందించేందుకు వెయ్యి పడకల ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర సేవలతో పాటు అన్ని ముఖ్య విభాగాల వైద్య సేవలు అందించేందుకు వీలుగా సిద్ధం చేయాలని టీజీఎంఐడీసీ శ్రీనివాస్, డీఈ విశ్వప్రసాద్‌లను ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం ఎంతమంది వైద్య సిబ్బంది పని చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అవసరమైన వసతులు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోగా పనులు పూర్తి చేయాలి

సిద్దిపేటరూరల్: జిల్లాలో పాఠశాలల అభివృద్ధి పనులు ఆగస్టు 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపడుతున్న పనులపై బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 804 ప్రభుత్వ పాఠశాలలో వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీరు, మైనర్ రిపేర్లు, కిచెన్ షెడ్ లు, కాంపౌండ్ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 724 పాఠశాలలలో పనులు పూర్తి అయ్యాయన్నారు. మరో 80 పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారుల ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: తల్లి పాల వారోత్సవాలు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యత, ఆరోగ్యం గూర్చి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి స్త్రీకి ప్రసవం సమయంలో మద్దతు అవసరమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు అందించడం, వాటి ప్రాముఖ్యతను తెలిజేయాలన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించేలా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ కలెక్టరేట్ ఏఓ రెహమన్, డీడబ్ల్యూఓ శారద, పలు జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



ఉపధ్యాయులను సన్మానించిన వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): ఉద్యోగ విధుల్లో చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపు నిస్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఆర్. భూపాల్, బీ. శ్రీనివాస్, వినయ్, ప్రకాష్ టీచర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.రాజేందర్, టీచర్లు దయాసాగర్ రెడ్డి, రవి శేఖర్, భాగ్యమ్మ, పీఈటీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాచారం ఉన్నత పాఠశాలలో..

బెజ్జంకి(సిద్దిపేట): ఉద్యోగులు చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దాచారం ఉన్నత పాఠశాల పీఈటీ శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో శ్రీనివాస్ కృషి చేశారన్నారు. పాఠశాలకు రెండు కంప్యూటర్‌లు, వాటర్ ఆర్‌ఓ అందజేస్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్ జిరాక్స్ ప్రింటర్‌ను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ మహాలక్ష్మి, హెచ్‌ఎంలు శ్రీరాములు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డిపాజిట్లు వాపస్

సాక్షి ఎఫెక్ట్

దుబ్బాక: రైతులకు కొత్తగా ఇస్తున్న రుణాల్లో కొంత కట్ చేయడం.. డిపాజిట్ చేయడంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. 'సాక్షి'లో వెలువడిన కథనం పై ఉన్నతాధికారులు స్పందించి డిపాజిట్లు చేయవద్దని బ్యాంకర్లను ఆదేశించారు. దుబ్బాక ఉమ్మడి మండలంలోని చిట్టాపూర్ ఏపీజీవీబీలో రైతుల రుణాల్లో నుంచి కొంత డబ్బును కట్ చేసుకొని డిపాజిట్ చేసుకున్న రైతులకు తిరిగి వాపస్ చేశారు. సమస్య తక్షణం పరిష్కారమైనందుకు పలువురు రైతులు సాక్షికి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. డిపాజిట్లపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం విశేషం.

వాహనాల కండీషన్ తప్పనిసరి



వాహనాలను పరిశీలిస్తున్న ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్

ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్

సిద్దిపేటకమాన్: డ్రైవర్లు ప్రతి రోజు వాహనాల కండీషన్‌ను పరిశీలించి వాహనాలను నడపాలని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. పోలీసు కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ వాహనాల కండీషన్‌ను ఏఆర్ అడిషనల్ డీసీపీ, పోలీసు ఎంటీఓ ధరణికుమార్, మెకానిక్ సహాయంతో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు డీసీపీ మాట్లాడుతూ వాహనంలో వాటర్, ఆయిల్, బ్యాటరీ కండీషన్ పరిశీలించి వాహనాలను నడపాలన్నారు.సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. వాహనాలకు అమర్చిన రాపిడ్ కాప్ అత్యాధునిక టెక్నాలజీ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సీటు బెల్ట్ ధరించి నడపాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, యంటి సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల సమస్యలు పరిష్కరించండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విశ్వకర్మలు

సిద్దిపేటరూరల్: విశ్వకర్మల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నరసింహాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో తమ సంక్షేమంపై చర్చించాలన్నారు. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలయ్యచారి, మనుమయ సంఘ ప్రతినిధులు యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాప్‌రే.. పామును పట్టేసిన కోడి



చంపిందో లేక చనిపోయిందో తెలియదు కాని.. ఓ కోడి పుంజు పామును పట్టుకొని తిరిగింది. అటూఇటూ తిరుగుతూ హల్‌చల్ చేసింది. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు ఔరా కోడిపుంజుకు ఎంత ధైర్యం అనుకుంటూ చర్చించుకున్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బచ్చాయిపల్లిలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

సమస్యల పరిష్కారానికే దీక్షలు

జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ శ్రీరాములు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సమస్యల పరిష్కారం కోసం మాల మహానాడు ఆధ్వర్యంలో ఆగస్టు 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలో దీక్షలు చేపడుతున్నట్లు జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు తెలిపారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో బుధవారం చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లో చైతన్య దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రాజయ్య, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మండల యాదగిరి, నాయకులు రమేష్, మల్లేశం, రాములు, పర్శరాములు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిరండి

దుబ్బాకటౌన్: మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు తెలిపారు. బుధవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లో సామాజిక చైతన్య దీక్షలు చేపడుతున్నామన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

- సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ
- కమిషనరేట్ ఆవరణలో వనమహోత్సవం



కమిషనరేట్ ఆవరణలో మొక్కలు నాటిన సీపీ అనురాధ, పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా సిద్దిపేట కమిషనరేట్ ఆవరణలో పోలీసు అధికారులతో కలిసి సీపీ బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి మొక్కలే రేపటి వృక్షాలని, ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కలు చాలా ముఖ్యమన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని మొక్కలు నాటాలన్నారు. కమిషనరేట్ ఆవరణలో 800 మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటి సంరక్షించాలని పోలీసు అధికారులకు సూచించారు. పోలీసు స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత, పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) మల్లారెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఏఓ యాదమ్మ, ఎస్‌ఐ సాయిప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలి

- నేటి నుంచి ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు
- డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ

మెదక్ కలెక్టరేట్: పుట్టిన వెంటనే పాపలకు ముర్రుపాలు తాగించాలని, ఫలితంగా రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బ్రహ్మాజీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నేటి నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పుట్టిన వెంటనే పాపకు ముర్రుపాలను అందించడం, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తామన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేయడం, ఐసీడీఎస్ సెక్టార్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్ల ఉమ్మడి గృహ సందర్శన నిర్వహిస్తామన్నారు. గ్రామస్థాయిలో పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్ తోపాటు హాస్పిటల్ సందర్శనలు చేయనున్నట్లు తెలిపారు. స్వయం సహాయక బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధి తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాసంగారి సురేశ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఊరెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లో తులం బంగారం, 20 తులాల వెండి, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. చోరీ సమయంలో దొంగలు పక్కింటి ఇళ్ల తలుపులకు గడియలు పెట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం, పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నకిలీ బంగారం బిస్కెట్‌తో మోసం

- పెళ్లి పేరుతో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్న దంపతులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



నకిలీ బంగారు బిస్కెట్

పటాన్‌చెరు టౌన్: నకిలీ బంగారు బిస్కెట్‌తో మోసానికి పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం మేరకు.. అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజరాజేశ్వరి రెండు నెలలుగా బీరంగూడలోని భ్రమరాంబిక కాలనీలో కిరాణా షాపు నడుపుతోంది. అప్పుడప్పుడూ కిరాణా సామగ్రి తీసుకోవడానికి రమణమ్మ అనే మహిళ వచ్చేది. జూలై 7వ తేదీన రమణమ్మ, ఆమె భర్త కలిసి రాజరాజేశ్వరి కిరాణా షాపు వచ్చారు. కూతురు వివాహం ఉందని కొంత డబ్బు కావాలని అడిగారు. అందుకు షూరిటీగా గోల్కొండ కేబుల్ లైన్ తవ్వకాల్లో దొరికిన ఓ బంగారం బిస్కెట్ పెడుతామని, రూ.8 లక్షలు ఇవ్వాలని అడిగారు. తన దగ్గర అంత డబ్బు లేదని, రూ.4 లక్షలు ఇచ్చి బంగారు బిస్కెట్‌ను తన వద్ద పెట్టుకుంది. ఐదు రోజులు తర్వాత కిరాణషాపు నిర్వాహకురాలు రమణమ్మకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి బిస్కెట్‌ను బంగారం షాపులో చెక్ చేయించగా నకిలీదని తేలింది. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి దంపతులిద్దరిపై బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డబుల్ బెడ్‌రూంల ప్రారంభోత్సవంలో చిట్టాపూర్ మాజీ సర్పంచ్ రాజయ్య (ఫైల్)



ప్రస్తుతం ఎండు మిర్చి అమ్ముతున్న రాజయ్య

నాడు ప్రజా బాట.. నేడు ఉపాధి వేట

రోజు వారి పనుల్లో మాజీ సర్పంచ్‌లు ● గతంలో గ్రామాల అభివృద్ధిలో నిమగ్నం
ప్రస్తుతం పొలం, కూలీలకు వెళ్తూ జీవనం ● చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు

పంట పొలాల్లో బాల్‌చంద్రం

గజ్వేల్‌రూరల్: గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజలకు గ్రామ ప్రథమ పౌరుడిగా సేవలందించిన సర్పంచ్ నేడు పంటపొలాల బాట పట్టాడు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకొని.. నేడు పదవీకాలం ముగియడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు అక్కారం మాజీ సర్పంచ్ గునిశెట్టి బాల్‌చంద్రం. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో మొత్తం 8 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలువగా బాల్‌చంద్రం 460 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా గెలుపొందారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి మంజూరైన సుమారు రూ.2 కోట్ల 50లక్షల నిధులతో డైనింగ్ హాల్, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ, పాఠశాల తరగతి గదులు, మహిళా భవనం, లైబ్రరీ, గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అప్పులు చేసి అభివృద్ధి పనులను చేపట్టగా ప్రభుత్వం నుంచి ఇంకా రూ.8 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటికీ 6 నెలలుగా ఎవరికి ఆపద వచ్చినా తానున్నానంటూ ప్రజలతోనే మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం పరితపిస్తున్నాడు. ప్రస్తుతం తనకున్న 4 ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తూ నిత్యం ప్రజాక్షేత్రంలో ఉన్నాడు.



వరినారు వేస్తున్న బాల్‌చంద్రం

మళ్లీ వ్యవసాయంతోనే



జగదేవ్‌పూర్(గజ్వేల్): తనకున్న పొలంలో పంటలు సాగు చేసే యువకుడు గత ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచి ఐదేళ్లు ప్రజా సేవ చేశాడు. పదవీ కాలం పూర్తికావడంతో మళ్లీ వ్యవసాయం చేస్తున్నాడు. గత ఎన్నికల్లో జగదేవ్‌పూర్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన తిగుళ్ల జహంగీర్ సర్పంచ్‌గా పోటీ చేయగా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనర్ పంచాయతీ కావడంతో ఆదాయం లేకున్నా అభివృద్ధి పనులు చేపట్టాడు. ఇందుకు సంబంధించి రూ.1.50 లక్షలు రావాల్సి ఉందని తెలిపాడు.

తోటి మహిళలతో వరినాట్లు



కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న రేణుక

తొగుట(దుబ్బాక): ఐదేళ్ల గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన మంగ రేణుక వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. మండలంలోని లింగంపేట సర్పంచ్‌గా భర్త నర్సింలుతో కలిసి గ్రామాభివృద్ధికి నిజాయితీగా పనిచేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన రేణుక సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించారన్న పేరు తెచ్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిత్తశుద్ధితో గ్రామాభివృద్ధికి కృషిచేశారు. ఆమె హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. పదవి నుంచి దిగిపోయి సాధారణ మహిళగా తోటి మహిళలతో కలిసి వరినాట్లు వేసేందుకు వెళ్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

కులవృత్తే ఉపాధి

శివ్వంపేట(నర్సాపూర్): సర్పంచ్‌గా పని చేసినప్పటికీ కులవృత్తిని మాత్రం మరిచిపోలేదు. మండలపరిధి ఉసిరికపల్లి గ్రామ సర్పంచ్‌గా పని చేసిన బాబురావు పోతురాజు వృత్తి చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వంశపారపర్యంగా వస్తున్న వృత్తిలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పోతరాజు గావు, బైన్ల పంబాల, ఎర్పుల వాలితో పాటు పలు రకాల పూజా కార్యక్రమాలు చేస్తున్నాడు.



మీ సేవ నడుపుతున్న రాజయ్య

ఎంఎస్సీ, బీఈడీ చదివి సర్పంచ్‌గా..

ఎంఎస్సీ, బీఈడీ చేసిన ఉన్నత విద్యావంతుడైన దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి తాజా మాజీ సర్పంచ్ కండ్లకొయ్య పరుశరాములు గ్రామంలోనే మీ సేవ నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఉన్నత విద్యా వంతుడైన పరుశరాములు గతంలో మీ సేవ సెంటర్ నడిపిస్తూ ప్రజలతో మంచి సంబంధాలు ఉండటంతో గ్రామస్తులు పట్టుబట్టి సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఐదేళ్లు నమ్మకంగా పనిచేసి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నాడు. రూ.10 లక్షల వరకు అప్పు తెచ్చి అభివృద్ధి పనులు చేసిన బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సర్పంచ్ కాక ముందు మీ సేవ నడిపిన పరుశరాములు సర్పంచ్ అయ్యాక పూర్తిగా ప్రజాసేవకే అంకితమై మీ సేవను ఆపరేటర్‌ను పెట్టి నడిపించాడు. చిన్న వయస్సులో ప్రజలకు సేవ చేయడం చాలా ఆనందంగా ఉందని, ఇప్పుడు మీ సేవ నడిపించుకుంటూ ప్రజల సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని చెప్పారు.



మీ సేవలో కండ్లకొయ్య పరుశరాములు

ఎండు మిర్చి బేరం చేస్తూ..

దుబ్బాక: దుబ్బాక మండలం (ప్రస్తుతం భూంపల్లి–అక్బర్‌పేట మండలం)లోని చిట్టాపూర్‌కు వరుసగా రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేశారు పోతనక రాజయ్య. అంతకు ముందు మిర్చి బేరం చేసిన రాజయ్య వరుసగా రెండు సార్లు సర్పంచ్ అయ్యాక పూర్తిగా ప్రజాసేవకే అంకితమయ్యాడు. బీఏ చదివిన రాజయ్య గతంలో కండక్టర్‌గా 2 ఏళ్లు హకీంపేట డిపోలో పని చేసి కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో పోలీస్ ఉద్యోగం సైతం చేశాడు. ఉద్యోగాలు సైతం వదులుకొని గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం, మిర్చి బేరం చేసుకుంటున్న రాజయ్యను గ్రామస్తులు వరుసగా 2 సార్లు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా రాజయ్య చాలా అభివృద్ధి పనులు చేసి దుబ్బాక మండలంలోనే మంచి సర్పంచ్‌గా పేరొందాడు. గ్రామాభివృద్ధికి వెచ్చించిన రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎండిన మిర్చి గతంలో చేసిన బేరం చేసుకుంటున్నాడు.

అవినీతి ఆరోపణలతో మాకు సంబంధం లేదు

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు



గజ్వేల్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు

గజ్వేల్: మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి చేసిన ఖర్చులో అవినీతి జరిగిందని, ఇందులో కౌన్సిలర్ల భాగస్వామ్యం ఉందని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు బాలేష్, అత్తెల్లి శ్రీనివాస్, గుంటుకు శిరీష, గంగిశెట్టి చందన, రజిత, వరలక్ష్మి, బాలమణి, శ్యామల, విద్యారాణి, దుంబాల లక్ష్మి, కురాకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ భవన ప్రారంభోత్సవ ఖర్చులను అప్పట్లో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కలిసి ముందుగానే డ్రా చేశారని, వారిని నిలదీస్తే దాటవేశారని తెలిపారు. ఈ విషయంపై సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ అంశంపై అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా చైర్మన్ వైఖరిని నిరసిస్తూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఈ అవినీతిలో కౌన్సిలర్లకు కూడా భాగముందని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు.

కన్న కొడుకే కామాంధుడై..

తల్లిపై అత్యాచారం..
మెదక్ జిల్లాలో ఘటన

చేగుంట/వెల్దుర్తి(తూప్రాన్): తాగిన మైకంలో కన్నతల్లిపై అత్యాచారం చేశాడో కామాంధుడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్(38) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బోనాల సందర్భంగా భార్యాపిల్లలు హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో తల్లీ కొడుకు మాత్రమే ఉన్నారు. సోమవారం రాత్రి పీకలదాక తాగిన లక్ష్మణ్.. మత్తులో కన్నతల్లి (60) అని చూడకుండా ఆమెపై అత్యాచారం చేశాడు. బుధవారం సాయంత్రం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి స్వాధీనం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం సుభాష్ నగర్‌కు చెందిన షేక్ సలీమ్(31) మేస్త్రీ పనిచేస్తాడు. ఇతను నిర్మల్ నుంచి బైక్‌పై వస్తూ గంజాయి తీసుకొస్తున్నాడనే సమాచారం అందింది. నార్సింగి పోలీస్‌స్టేషన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి అతడి వాహనం తనిఖీ చేసి 46 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిండు గర్భిణిని చిదిమేసిన కంటైనర్

- బైక్‌ను ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం
- తెగిపడిన గర్భస్థ శిశువు తల
- మెదక్ జిల్లాలో విషాదకర ఘటన

మనోహరాబాద్(తూప్రాన్)/మిరుదొడ్డి(దుబ్బాక): కంటైనర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఏడు నెలల గర్భిణి దుర్మరణం చెందింది. ఆమె గర్భంలో ఉన్న శిశువు తల తెగి బయటపడింది. హృదయ విదారకమైన ఈ సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లె గ్రామానికి చెందిన పనేటి రేణ(29), పోచయ్య దంపతులు. వీరికి పదేళ్లలోపు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. తండ్రి పోచయ్య దగ్గరే ఉంటున్నారు. ఇతను గ్రామంలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో రేణ.. బతుకుదెరువు కోసం గ్రామాన్ని విడిచి వెళుతుండేది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ గ్రామానికి వస్తూ ఉండేది. కాగా, రేణ, బాబు, గుర్తు తెలియని వ్యక్తితో కలసి బైక్‌పై మేడ్చల్ వైపు 44వ జాతీయ రహదారిపై వెళ్తున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రం దగ్గరలోకి రాగానే వేగంగా వచ్చిన కంటైనర్ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెనకాల కూర్చున్న రేణ.. లారీ టైరు కిందపడి నలిగిపోయింది. శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఆమె కడుపులో ఉన్న 7 నెలల గర్భస్థ శిశువు తల తెగి మృతదేహం సైతం బయటపడింది. బైక్ నడుపుతున్న వ్యక్తికి, బాలుడికి గాయాలయ్యాయి. ప్రమాదం జరగ్గానే సదరు వ్యక్తి బాలుడిని తీసుకుని పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. బైక్ నడిపిన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా, గర్భిణి రేణ దుర్మరణంపై సొంతూరు మల్లుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.



లారీ చక్రాల మధ్య బైక్



రేణ (ఫైల్)

అప్పట్లో శిశువు విక్రయం.. సంచలనం

రేణ, పోచయ్య కుటుంబం పేదరికంతో దుర్భర జీవితం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వీరిని పోషించే ఆర్థిక స్థోమత లేక ఐదేళ్ల క్రితం ఒక శిశువుని దత్తతకు ఇచ్చారు. మగ శిశువుని అమ్ముకున్నారన్న వార్త జిల్లాలో సంచలనంగా మారింది. దీంతో దత్తతకు ఇచ్చిన బాలుడిని అధికారులు శిశు సంరక్షణకు తరలించడం, ఆ తర్వాత అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

అన్ని కోణాల్లో పరిశోధించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- పెండింగ్ కేసులపై సమీక్ష

సిద్దిపేటకమాన్: దొంగతనాల కేసులను అన్ని కోణాల్లో పరిశోధించి ఛేదించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై బుధవారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తుదారుడితో సంబంధిత ఎస్ఐ తప్పకుండా మాట్లాడి సమస్య తెలుసుకొని పరిష్కరించాలన్నారు. తరచుగా నేరాలు చేసే నేరస్తులపై తప్పకుండా షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. బ్లూ కోట్, పెట్రో కార్ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పట్టణాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీలు మధు, సతీష్, రవీందర్, శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్): పెండింగ్ కేసులన్నీ త్వరగా పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం చేగుంట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని రికార్డులతో పాటు ఫిర్యాదులను పరిశీలించారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని స్టేషన్‌హౌస్ అధికారికి తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ చేగుంట ఎస్ఐ బాలరాజు సిబ్బంది ఉన్నారు. అనంతరం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డయల్ 100కు సత్వరం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదు తీసుకున్న వెంటనే రశీదు అందించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల వివరాలను ఎస్ఐ నారాయణగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి..

దుబాయ్‌లో గోనెపల్లి వాసి మృతి



రాజు(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన యువకుడు గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజు(36)కు భార్య రజిత, కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపాధి కోసం పదేళ్ల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఏడాది కిందట స్వగ్రామానికి వచ్చి తిరిగెళ్లాడు. మంగళవారం రాత్రి రాజు కూలీ పనులు చేస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. తోటి కూలీలు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించే క్రమంలో రాజు మృతి చెందాడు. విషయం గ్రామంలో తెలియడంతో విషాదం నెలకొంది. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రెండు వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఇద్దరు మృతి చెందారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. రాయపోల్ మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన తొర్రి దర్శన్(21) ద్విచక్ర వాహనంపై పని మీద మంగళవారం సిద్దిపేటకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాజీవ్‌రహదారిపై వస్తుండగా చిన్న కిష్టాపూర్ బస్టాప్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దర్శన్‌కు తీవ్ర గాయాలు కాగా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా వైద్యుల సూచనల మేరకు గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

తిమ్మారెడ్డిపల్లి శివారులో..

మెడ్చేల్ జిల్లా నాగారం (కీసర)కు చెందిన గుండ్ల చంద్రశేఖర్(58) కరీంనగర్‌లో ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం సొంత ఇన్నోవా వాహనంలో ఉద్యోగానికి వెళ్లాడు. పని ముగించుకొని బుధవారం రాత్రి బయలు దేరాడు. తిమ్మారెడ్డిపల్లి శివారులోకి రాగానే ముందు వెళ్తున్న వాహన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో చంద్రశేఖర్ ముందు వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళ్తున్న వాహనం పరారీలో ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

లిఫ్ట్ అడిగి వెళ్తుండగా మహిళ..

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం పోతాన్‌శెట్టిపల్లి శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం తుపాకులపల్లి గ్రామానికి చెందిన శివలక్ష్మి(48) చేగుంట మండల చందాయిపేట గ్రామానికి ఓ వేడుకకు వస్తుంది. మాసాయిపేటలో బస్సు దిగి చందాయిపేటకు వెళ్లడానికి ఆటోలు లేక ఓ బైక్ అతడిని లిఫ్ట్ అడిగి వెళ్తుంది. పోతాన్‌శెట్టిపల్లి శివారులోని రాగానే వీరి బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

కారు, బైక్ ఢీ

కౌడిపల్లి(నర్సాపూర్): కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం ధర్మాసాగర్ గేట్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డి కథనం మేరకు.. కొల్చారం మండలం దుంపలకుంట తండాకు చెందిన కొర్ర గోపిలాల్ బైక్‌పై హైదరాబాద్ నుంచి ఇంటికి వస్తున్నాడు. ధర్మాసాగర్ గేట్ సమీపంలోనికి రాగానే ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గోపిలాల్‌కు తీవ్రగాయాలు కాగా కారుకు ధ్వంసమైంది.